ప్రజాశక్తి
గురువారం 20 ఫిబ్రవరి 2025 5 శ్రీ సత్యసాయి





సమావేశంలో పాల్గొన్న చైర్మన్ లంక దినకర్, కలెక్టర్, ఎమ్మెల్యే

పటిష్టంగా 20 సూత్రాల అమలు

కమిటీ చైర్మన్ లంక దినకర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష సాధనలో భాగంగా జిల్లాలో 20 సూత్రాల అమలు కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంక దినకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ టిఎస్.చేతన్‌తో కలిసి అధికారులతో ఛైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ప్రధాని మోడీ, చంద్రబాబు వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పని చేస్తున్నారని చెప్పారు. వారి లక్ష్యానికి అనుగుణంగా జిల్లా అధికారులు ముందుకు వెళ్లాలని సూచించారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందన్నారు. గ్రామీణ సడక్ యువజన కింద ప్రతి గ్రామానికి రహదారులు నిర్మించాలన్నారు. స్వయం సహాయక గ్రూపుల ద్వారా మహిళలను లక్షాధికారులుగా చేసే పనిని మరింత వేగవంతం చేయాలన్నారు. చిన్న సన్నకారు రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా డ్రోన్ వినియోగానికి కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులకు ఇవ్వాలన్నారు. టిడ్కో గహాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాల్లో పురోగతి ఉండాలేన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, అమత్ పథకం, పిఎం ఆవాజ్ యోజన, టిడ్కో గృహాలు, పిఎం సూర్య ఘర్, వ్యవసాయానికి అందించే విద్యుత్ తదితర అన్నింటిపైనా అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఉద్యానవన పంటలకు అనువైన భూమి ఉన్న నేపథ్యంలో దానిని వినియోగంలోకి తేవాలన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ వచ్చే నవంబర్‌లో సత్యసాయి 100వ జయంతి వేడుకలు సందర్భంగా చిత్రావతి సుందరీ కరణ, రహదారుల నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, పరిశ్రమల జిఎం నాగరాజు, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లద తదితరులు పాల్గొన్నారు.

రైతుకు రాయితీ పెంపు

- డ్రిప్, స్ప్రింక్లర్లపై కొత్త మార్గదర్శకాలు
- ఎస్సీ,ఎస్టీ చిన్నసన్న కారు రైతులకు వంద శాతం
- ఇతరులకు 90 శాతం సబ్సిడీ





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

డ్రిప్,స్ప్రింక్లర్ల రాయితీల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. గతంలో ఉన్న దానికంటే రాయితీని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలనూ ఇచ్చింది. ఇందులో ప్రధానంగా ఉద్యానవన రైతుకు ఊరట లభించే అవకాశముంది. అంతకు మునుపు ఐదు ఎకరాల్లోపున్న వారికి 90 శాతం సబ్సిడీనిచ్చి, ఆపైనున్న రైతులకు 70 శాతం సబ్సిడీ ఉంది. కొత్తగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ రాయితీ మరింతగా పెరగనుంది.

ఎస్సీ,ఎస్టీ రైతులకు ఉచితం

ఐదు ఎకరాల్లోపు సాగుభూమి కలిగిన ఎస్సీ,ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ ఇచ్చే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 33 శాతం కాగా, 67 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఉండనుంది. సబ్సిడీ మొత్తం రూ.2.18 లక్షలు ఉండనుంది. ఎస్సీ,ఎస్టీకాని ఇతర సన్న చిన్నకారు రైతులు ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన వారికి 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇవ్వనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 33 శాతం వాటాకాగా, రాష్ట్ర ప్రభుత్వం 57 శాతం వాటా ఇవ్వనుంది. తక్కిన పది శాతం రైతు తన వాటాగా కట్టాల్సి ఉంటుంది. ఇక రాయలసీమ జిల్లాలతోపాటు, ప్రకాశం జిల్లా, ఇతర ప్రాంతాల్లో ఎస్టీ రైతులు ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు భూమి ఉన్నప్పటికీ 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇవ్వనున్నారు.ఇందులో సబ్సిడీ విలువ గరిష్టంగా రూ.3.46 లక్షలు ఉండనుంది. కోస్తా ప్రాంతంలో ఉన్న వారికి 70 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇవ్వనున్నారు. స్ప్రింక్లర్లకు మాత్రం అందరికీ 50 శాతం సబ్సిడీతో ఇవ్వనున్నారు.

కాస్త ఊరట

ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాలతో రైతుకు కాస్త ఊరట లభించనుంది. ప్రధానంగా ఉద్యానవన రైతుకు ఊరట లభించే అవకాశముంది. గతం నుంచి సబ్సిడీ పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సబ్సిడీని తగ్గించడంతోపాటు పరికరాలు కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఈ సబ్సిడీ పెంపుదలతో పెట్టుబడుల్లో వెసలుబాటు లభించినట్టయింది.

ఇన్‌ఛార్జుల పాలన అస్తవ్యస్తం


అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మంత్రి నియోజకవర్గంలోని సోమందేపల్లి మండలంలో ముఖ్య పరిపాలన కార్యాలయాలైన తహాశీల్దార్, ఎంపిడిఒ, మేజర్ పంచాయతీ కార్యాలయాలలో ఇన్‌ఛార్జుల పాలన కొనసాగుతోంది. వారు రెండు మూడు చోట్ల పనిచేయడంతో సకాలంలో కార్యాలయాలకు హాజరుకావటం లేదు. దీంతో ఇన్‌ఛార్జుల పాలన అస్తవ్యస్తంగా తయారైంది. తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్, ఇద్దరు ఆర్ ఐ లు, ఐదుగురు వీఆర్వో పోస్టు ఖాళీగా ఉన్నాయి, రీ సర్వే తహాశీల్దార్ చాలా రోజులుగా డిప్యుటేషన్ పైన కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ కూడా డిప్యూటేషన్ పైన ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. దీంతో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మంగళవారం మండల ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్లి అధికారులు ఎవరూ లేకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు. ఇదిలా ఉండగా మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దాదాపు సంవత్సర కాలంగా ఎంపీడీవో పోస్ట్ ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జితో పాలన కొనసాగిస్తున్నారు. ఇదే కార్యాలయంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు గ్రూప్ వన్, గ్రూప్ టు, పరీక్షల నేపథ్యంలో సెలవులు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఈ తొమ్మిది నెలల కాలంలో ఇద్దరు ఎంపీడీవోలు ఇన్‌ఛార్జులుగా వచ్చి వెళ్లిపోయారు. మండల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడే ముఖ్య అధికారి ఎంపీడీవో లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు దాదాపు 20 వేల జనాభా ఉన్న మేజర్ పంచాయతీ కార్యాలయంలో సుమారు మూడు సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శులు ఇన్‌ఛార్జులుగా కొనసాగుతున్నారు. శాశ్వత గ్రేడ్ వన్ కార్యదర్శి లేకపోవడంతో మేజర్ పంచాయతీలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందనంగా ఏర్పడింది. ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకొని ప్రధాన కార్యాలయాలలో శాశ్వత ఉద్యోగులను నియమించే విధంగా చర్యలు తీసుకొని మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించాలి

బీసీ సంక్షేమ జౌళి శాఖ మంత్రి సవిత నియోజకవర్గంలోని సోమందేపల్లి మండలంలో పూర్తిస్థాయి మండల అధికారులు లేకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. కాపు, బీసీ నేస్తంతో పాటు ఇళ్ల స్థలాలు , కియా అనుబంధ పరిశ్రమల పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులు, రైతుల రుణాలు నేపథ్యంలో వందలాదిమంది మండల ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అధికారులు లేకపోవటంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి బాటలు వేస్తున్నామని మాటల్లో చెబుతున్న మంత్రికి మండల సమస్యలు కన్పించకపోవటం శోచనీయం. ఇప్పటికైనా స్పందించాలి. లేదంటే రాబోవు కాలంలో ప్రజాసంఘాలతో కలసి ఉద్యమిస్తాం

ఎం. పెద్దన్న,
వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి


బాధ్యతలు స్వీకరిస్తున్న విసి హెచ్.సుదర్శనరావు

జెఎన్‌టియును అభివృద్ధి పథంలో తీసుకెళ్తా

బాధ్యతల స్వీకరణలో విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియును అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు తెలియజేశారు. జెఎన్‌టియు విసిగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తనపై ఎంతో నమ్మకంతో రెగ్యులర్ ఉపకులపతిగా నియమించారన్నారు. తాను చదువుకున్న కళాశాల, మొదట ఉద్యోగం చేసిన యూనివర్సిటీకి ఉపకులతిగా నియమితులు కావడంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. తోటి ఉద్యోగులు, సిబ్బంది అందరి సహకారంతో అనంతపురం జెఎన్‌టియు అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన విసి సుదర్శనరావును రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్‌డిటు వీసీ ఎన్. దేవన్న, జెఎన్‌టియు ఇంజిరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ విష్ణు వర్ధన్, ఓటిపిఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, వర్సిటీ డైరెక్టర్లు సురేష్ బాబు, దుర్గాప్రసాద్, నాగప్రసాద్ బాబు, పరీక్షల విభాగం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్ ఏపీ శివకుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, రంగనాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగభూషణ్, సునీల్ కుమార్‌తో పాటు రాధా ప్రింటర్స్ అధినేత టి.ప్రసాదరావు, వివిధ విభాగాల ఆధిపతులు, ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు పుష్ప గుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు ద్రోహి జగన్: మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రైతు ద్రోహి జగన్ అని, వైసీపీ పాలనలో ఏనాడూ అన్నదాతలను పట్టించుకున్న పాపాన పోలేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత విమర్శించారు. ఈ మేరకు బుధవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. మునిగిపోతున్న తన పార్టీని కాపాడుకోడానికి జగన్ వేస్తున్న పిల్లి మొగ్గలను ప్రజల గమనిస్తున్నారని, మరోసారి ఆయనను నమ్మే పరిస్థితే లేదని స్పష్టం చేశారు. జగన్ అసమర్థ పాలన వల్ల గడిచిన 5 ఏళ్లలో ఎందరో రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించకుండా ముఖం చాటేసిన ఘనుడన జగన్ అని మండిపడ్డారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులున్నా... ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ధాన్యం బకాయిలను సీఎం చంద్రబాబు చెల్లించారని తెలిపారు. రైతు వ్యతిరేకిగా, ద్రోహిగా ముద్రపడిన జగన్ ను ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసి తగిన గుణపాఠం చెప్పారన్నారు. జగన్ అసమర్థతను గ్రహించిన వైసీపీ నేతలు ఒక్కొక్కరిగా వైసీపీని వీడిపోతున్నారన్నారు. దీంతో చేసేదేమీ లేక, పార్టీని కాపాడుకోడానికి రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ మిర్చి రైతుల పరామర్శ పేరుతో కొత్త డ్రామా తెర తీశారన్నారు. జగన్ నమ్మే పరిస్థితిలో రైతులే కాదు వైసీపీ నేతలే లేరన్నారు.

మున్సిపల్ కార్మికులపై పనిభారాన్ని తగ్గించండి

ప్రజాశక్తి-పెనుకొండ


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో ఆనంద్ కుమార్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మి నారాయణ మాట్లాడుతూ పెనుకొండ నగర పంచాయతీగా మారినా పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సంఖ్య పెంచలేదన్నారు. తక్కువ సంఖ్యలో ఉన్న కార్మికులపై పని భారం ఎక్కువైనదని జీవో 279ప్రకారం 250 కుటుంబాలకు నలుగురు కార్మికులు ఉండే నిబంధన అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, యూనియన్ మండల కార్యదర్శి వెంకటేశులు,ముత్యాలప్ప, నరసమ్మ, రాము, లక్ష్మిదేవి, వెంకటేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్‌లో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచులు తమ పంచాయతీ పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. సమావేశానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరవుతున్నట్లు ప్రకటన ఇవ్వడంతో సర్పంచులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లవచ్చునని భావించారు. మండలంలోనిరాచువారి పల్లి, వెంకట గారి పల్లి, కప్పల బండ, పైపల్లి తదితర సర్పంచులు బొకేలను సైతం తెచ్చుకొని సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. అయితే ఎమ్మెల్యే కలెక్టరేట్లో సమావేశం ముగించుకుని అక్కడి నుంచి అలాగే వెళ్లిపోయారు. మండల ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే కోసం ఎదురుచూసి చివరకు సమావేశాన్ని కొనసాగించారు. అనంతరం ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు సభ్యులు తమ పంచాయతీల పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు కో ఆప్షన్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

నిరసనలో కాలనీవాసులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లిలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ టిడిపి నాయకులు జక్కంపూడి నాగభూషణం ఆధ్వర్యంలో కాలనీ వాసులు బుధవారం నిరసన తెలిపారు. బత్తలపల్లి సచివాలయం వద్ద ఎస్సీ కాలనీ మహిళలతో కలిసి నిరసన చేపట్టారు. మండల స్థాయి అధికారులు,సచివాలయ సిబ్బంది నీటి సమస్య పరిష్కారంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యపై పలుమార్లు సచివాలయం దృష్టికి, ఎంపీడీవో, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కనిపించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ని అధికారుల వైఖరిని నిరసిస్తూ సచివాలయంలోకి అధికారులు వెళ్లకుండా అడ్డుకున్నారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ వారం రోజులలో ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

ప్రశాంతి రైల్వే ఆటో యూనియన్ ఏర్పాటు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి రైల్వేస్టేషన్లో సీఐటీయు ఆధ్వర్యంలో ఆర్‌విజె ప్రశాంతి రైల్వేస్టేషన్ ఆటో యూనియన్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులుగా పైపల్లి గంగాధర్, అధ్యక్షులుగా సాకే మాధవ, ఉపాధ్యక్షులుగా సుధాకర్, మందల అన్వేష్, కార్యదర్శులుగా కే. సురేష్, నాగరాజు, కోశాధికారిగా లక్ష్మిపతిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాతంగి సాయి, పవన్, సాయి, నరసింహులు, శ్రీరాములు, ఓబుళపతి, తదితరులు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆటో కార్మికులు సమస్యలను పరిష్కరించేందుకు యూనియన్ నాయకులు సంసిద్ధంగా ఉండాలని, ప్రభుత్వ , రవాణా శాఖ, నిబంధన కట్టుబడి ఆటో కార్మికులు వ్యవహరించాలని సూచించారు.

అబాకస్ జాతీయ స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థిని

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



ప్రతిభా విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

అబాకస్ విద్య మెదడుకు మరింత పదును పెడుతుందని స్థానిక సాధన పాఠశాల కరెస్పాండెంట్ సీతాపతి రావు, అబాకస్ (వేదిక్ మాథ్స్) ఇంచార్జ్ వాసవి, సాధన పాఠశాల ఇంచార్జి భువనేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాయగూరల మార్కెట్ వద్ద గల సాధన ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో బుధవారం అబాకస్ జాతీయ స్థాయిలో ఎంపికైన వి. జాహ్నవికు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న జాహ్నవి తొలుత ధర్మవరంలో జరిగిన అబాకస్ పోటీలలో జిల్లా స్థాయికి రావడం, తదుపరి విజయవాడలో రాష్ట్రస్థాయికి రావడంతో పాటు అక్కడే జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. తమ పాఠశాలలో చదువుతోపాటు వివిధ క్రీడా పోటీలు, విజ్ఞాన పోటీలకు కూడా విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతోందని తెలిపారు. మార్చి నెలలో హైదరాబాదులో అబాకస్ జాతీయ పోటీల్లో జాహ్నవి పాల్గొంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేదిక్ మాథ్స్ (అబాకస్) టీచర్ మంజులా దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి : వ్యకాసం

ప్రజాశక్తి-సోమందేపల్లి


సమస్యను వివరిస్తున్న నాయకులు, కూలీలు

మండలంలోని రంగేపల్లికి చెందిన ఉపాధి కూలీలకు 9 వారాల నుంచి బకాయి ఉన్న బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ సభ్యులు కిష్టప్ప తెలిపారు. ఈ మేరకు గ్రామ ఉపాధి కూలీలు వ్యకాసం ఆధ్వర్యంలో తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒకు సమర్పించారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నామన్నారు. కూలీల సమస్యలను అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. కూలీలకు అధికారులు చూపించిన పనుల్లో పని ఎక్కువ కూలి తక్కువ ఉందన్నారు. వారానికి 600 రూపాయలు మించి కూలి రావడం లేదని , ఇది కూడా తొమ్మిది వారాల నుండి బకాయి ఉందని చెప్పారు. ఏ వారానికి ఎంత బిల్లు వస్తుందో పే స్లిప్పులు కూలీలకు ఇవ్వడం లేదన్నారు. ఇక పనిముట్లు పంపిణీ ఊసే లేదని , ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నా కనీసం మజ్జిగ , నీటి సౌకర్యం కల్పించలేదని విమర్శించారు. స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ తక్షణం బకాయి ఉన్న అన్ని వారాల పేస్లిప్‌లు పంపిణీ చేసి బిల్లులు వారంలో ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య , భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు , మండల నాయకులు నాగభూషణ, కల్లుగీత కార్మిక సంఘం రామకృష్ణ , ఉపాధి కూలీలు లక్ష్మమ్మ, అంజినమ్మ, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి గాండ్లపెంట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్మ్యునేషన్ అధికారి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్ర నాయక్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై డాక్టర్ బాబా ఫక్రుద్దీన్‌తో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ సిబ్బంది విఆర్ ప్రసాద్, సూపర్‌వైజర్ ఉపేంద్ర రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

తాగునీటికి సమస్య తలెత్తనివ్వం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మేజర్ గ్రామపంచాయతీ ప్రజలకు తాగునీటికి ఎటువంటి సమస్య రాకుండా చూడడమే తమ ధ్యేయమని మేజర్ పంచాయతీ సర్పంచి నాగలక్ష్మి రాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో పంచాయతీ నిధులతో నూతన బోరు వేయించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడడమే తమ ప్రథమ కర్తవ్యం అని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. సాయిరాం ట్రస్ట్ తరఫున విద్యార్థులకు నీటి సమస్యను తీర్చామని దాత సాంబశివారెడ్డి తెలిపారు. ఈ పాఠశాలలో 430 మంది విద్యార్థులు ఉన్నారని ప్రధానోపాధ్యాయురాలు శిరీష తెలిపారు. లక్ష రూపాయలకు పైగా ఖర్చు పెట్టి కుళాయిలు అమర్చడం అభినందనీయమన్నారు. దాత సాంబశివారెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు సాయిరాం రెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా ఈ చేయూత నందించడం జరిగిందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎస్ఐ వలిబాషా పేర్కొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

స్థానిక శ్రీసత్య సాయి జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ డే వేడుక ఘనంగా జరిగింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుండి కష్టపడి చదివే గుణం అలవాటు చేసుకోవాలన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళితే ఉజ్వలమైన భవిష్యత్తును చేరుకోగలరన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి, కళాశాల ఏవో కేశవయ్య, అధ్యాపకులు బాబు మల్లికార్జున, చెన్నకేశవ, మురళి, మంజునాథ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మానవ హక్కుల సంఘం నాయకులు ఎంవి పాపన్న, బి శంకర, బాషా, అన్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ, ప్రమీల, చిట్టెమ్మ,అరుణ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 23 లక్షల నిధులతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ పనులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాలప్ప నాయుడు, హెడ్‌నర్సు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-సోమందేపల్లి

కేంద్రబడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండల కార్యదర్శి రంగప్ప తెలిపారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో కొండా వెంకటేష్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల రాష్ట్రం తో పాటు జిల్లాకు కూడా మోసం జరిగిందని అన్నారు. గురువారం నిర్వహించే నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హనుమయ్య, కొండా వెంకటేష్, మాబు, రామకృష్ణప్ప, నాగభూషణ, నాగరాజు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నడుమ గ్రామ సచివాలయం



సోమందేపల్లిలోని నాలుగవ సచివాలయ భవనం

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని నాలుగవ సచివాలయం సమస్యల నడుమ కొనసాగుతోంది. ఉద్యోగులు ప్రజలకు సేవలు అందించలేక పోవడంతోపాటు అందులో పని చేసే ఉద్యోగులు కనీస సౌకర్యాలు లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నుండి ఒక కిలోమీటర్ దూరంలో కొట్టాలలో ఒక పాత గృహంలో సచివాలయం ఏర్పాటు చేశారు.. ఈ సచివాలయంలో సుమారుగా నాలుగు నెలల కాలంగా ప్రింటర్ పనిచేయడం లేదు. అంతేకాకుండా ఈ సచివాలయానికి వైఫై సౌకర్యం కూడా లేదు. వివిధ పనుల నిమిత్తం ఈ సచివాలయానికి వచ్చే ప్రజలు వన్ బి, అడంగల్, తదితర ప్రభుత్వ సేవలకు రుసుము చెల్లించి అప్లై చేస్తే దానికి సంబంధించిన పత్రం కోసం మరో సచివాలయానికి కానీ లేదా ప్రైవేట్ నెట్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలలో మరోసారి రుసుము చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంటే ఒక ప్రభుత్వ సేవ కోసం రెండు సార్లు రుసుము చెల్లించే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. వ్యయ ప్రయాసలతో ప్రజలు సచివాలయానికి వస్తే అక్కడ ఉద్యోగులు ఉన్నా కూడా పనులు జరగక మరో సచివాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సచివాలయంలో ఆరుగురు ఉద్యోగులలో దాదాపు నలుగురు మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించినా కూడా నీటి సౌకర్యం లేక అవి నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో మహిళా ఉద్యోగులు ప్రాథమిక అవసరాల కోసం పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సచివాలయంలో పలు సమస్యల మధ్య ఉద్యోగులు పనిచేయవలసిన పరిస్థితి ఏర్పడింది, కోట్ల రూపాయల లావాదేవీలు జరిగే మేజర్ పంచాయతీలో ఇలాంటి పరిస్థితులు ఏర్పడటం బాధాకరం. ఇప్పటికైనా ఉన్నతాధికారులకు స్పందించి ప్రజల సౌకర్యార్థం సచివాలయంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

విద్యార్థులకు కంటిపరీక్షలు

ప్రజాశక్తి -ధర్మవరం టౌన్

మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు కంటి వైద్య చికిత్సలు నిర్వహించి అవసరమైన వారికిఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామని డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సల్మాన్ తెలిపారు. మండల పరిధిలోని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 21 మంది బాలికలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పుష్పలత, ఆప్తాలిక్ వైద్యాధికారి ఉరుకుందప్ప, ఎఎన్ఎం శివమ్మ ఎంఎల్‌హెచ్‌పి అనిత, ప్రిన్సిపల్ చంద్రకళ పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉచిత కంటి పరీక్షలను బుధవారం నిర్వహించారు. అవసరమైన వారికి కంటిఅద్దాలు పంపిణీ చేశారు. కెజిబివిలో 35 మందికి అద్దాలు పంపిణీ చేశారు అలాగే మండలము మొత్తం 60 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - మడకశిర



స్థానికులతో కలసి టీ తాగుతున్న ఎమ్మెల్యే

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'టీ టైమ్ విత్ ఎమ్మెల్యే అనే కార్యక్రమంలో భాగంగా ఉదయం పట్టణం లోని ఒడిసలమ్మ దేవాలయం వద్ద ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మడకశిరకు చెందిన ఉదయ్ అనే వ్యక్తి ఎమ్మెల్యేకు తన సమస్యను వివరించారు. తనకు 3 ఏళ్ల క్రితం పక్షవాతం వచ్చిందని ప్రస్తుతం తన ఆరోగ్యం కాస్త కుదుట పడిందన్నారు. తనకు ఏదైనా ఉపాధిమార్గం చూపిస్తే నా కుటుంబాన్ని పోషించుకుంటానని అభ్యర్థించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అతనికి సెక్యూరిటీ ఉద్యోగం ఇప్పించి ఈ రోజు నుండే ఉద్యోగం చేసుకోవాలని సూచించారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు : ఎంఇఒ



ఎస్ఎఫ్ఐ నాయకుల సమక్షంలో విద్యాసంస్థకు నోటీసు ఇస్తున్న ఎంఇఒ గంగప్ప

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎంఇఒ గంగప్ప హెచ్చరించారు. అనుమతులు లేకుండా పట్టణంలోని డిబి కాలనీలో భాష్యం పాఠశాల యాజమాన్యం తరగతులను నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు బుధవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. స్పందించిన ఎంఇఒ భాష్యం పాఠశాలను సందర్శించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎల్ కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయా విద్యార్థుల తల్లిదండ్రులను సమాచారం అందించి, వారిని ఇంటికి పంపించాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా తరగతులను నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వారికి హెచ్చరించి విద్యార్థి సంఘ నాయకుల సమక్షంలో ప్రిన్సిపల్ కు నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు హుస్సేన్, విశ్వనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వాల్మీకి సంఘం నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో ఆసంఘం నాయకులు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని బుధవారం కలిసి వాల్మీకులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ అంశం మీద అసెంబ్లీలో తమగళం వినిపించాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు మాధవయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణి రవి, యూత్ వింగ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ క్రాంతి కుమార్, జిల్లా సెక్రెటరీ దాసరి చలపతి, నగర అధ్యక్షులు కుళ్లాయప్ప, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, నగర ప్రధాన కార్యదర్శి ముత్యాలు, ఎపివిబిఎస్ నాయకులు కేశవ, వాల్మీకి నాయకులు బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు



డిసిసి అధ్యక్షులుతో కదిరి నాయకులు

సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కదిరి టౌన్

సూపర్‌సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందనిప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేయకపోతే ఉద్యమాలు తప్పవని డిసిసి అధ్యక్షులు ఇనయతుల్లా హెచ్చరించారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిలమత్తూరు మోహన్ గాంధీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇనాయతుల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 9 నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాల హామీలు అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేదంటే పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆధ్వర్యంలో ప్రజా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కదిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

వ్యాపారులు తూకాల్లో, కొలతల్లో మోసం చేయడంతో పాటు ఎంఆర్‌పి ధరలను అతిక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులను నమోదు చేయడంతో పాటు శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల రాయలసీమ రీజియన్ జాయెంట్ కంట్రోలర్ గోపీక్రిష్ణా రెడ్డి హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో బాగంగా బుధవారం హిందూపురం తూనికలు, కొలతల కార్యాలయాన్ని తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు స్కేళ్లల్లో వేసే తూకాల్లో మోసానికి పాల్పడే వ్యాపారులపై కేసులు తప్పవన్నారు. ప్రదానంగా పెట్రోల్ బంకుల్లో పెట్రో, డిజిల్ కొలతల్లో తేడా రావడం, ప్రభుత్వ చౌక దుకాణాల్లో డీలర్లు తక్కువ తూకాలు ఇస్తున్నారని ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ప్రధానంగా హిందూపురం వ్యవసాయ మార్కెట్ లో తూకాల్లో వాడుతున్న స్కేల్స్, తూకపు రాళ్లు, ఎలెక్ట్రానిక్ మిషన్స్ విడతల వారీ తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా తూకాల్లో, కొలతల్లో మోసాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

ఎంజేపీ గురుకుల పాఠశాల అప్‌గ్రేడ్‌పై హర్షం

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

రామగిరి మండలం నసనకోట ఎంజేపీ గురుకుల పాఠశాల అప్‌గ్రేడ్ అవడం పట్ల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నసనకోట ఎంజేపీ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే సునీత పాఠశాలలో విద్యార్థినులు, సిబ్బందిని కలసి ఆనందాన్ని పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో ఎంజేపి పాఠశాల రావడానికి, ఆ తర్వాత ఇదే పాఠశాలను జూనియర్ కళాశాల వరకు అప్ గ్రేడ్ చేయడానికి ఎమ్మెల్యే సునీత ఎంతో కృషి చేశారని విద్యార్థినులు, ఉపాధ్యాయులు అన్నారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రామగిరి ప్రాంతంలో గతంలో చాలా మంది బాలికలు చదువుకునే వారు కాదని.. అందుకే ఇక్కడ ఎంజేపి పాఠశాల వచ్చేలా చేశామని అన్నారు. పది తర్వాత ఇంటర్ చదివే అవకాశం లేకపోవడంతో చాలా మంది చదువు ఆపేస్తున్న విషయాన్ని గమనించామన్నారు. అందుకే ఇక్కడే ఇంటర్ వరకు ఉంటే ఎంతో మంది పిల్లలు చదువుకునే అవకాశం ఉందని కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని రకాలుగా ప్రయత్నించామని చెప్పారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి సంస్థ సీడ్ యాప్ సంయుక్తంగా పుట్టగొడుగుల పెంపకం, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వైటిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి బి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ ఆ పైన చదివిన వారు ఈ కోర్సులను నేర్చుకోవడానికి అర్హులు అని అన్నారు. ఆసక్తి ఉన్న యువతి యువకులు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ సాయి గణేష్ సంప్రదించాలని కోరారు. లేదా సెల్ నెంబర్. 9966682246, 7989923515లో సంప్రదించాలన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యతోపాటు మౌలిక వసతులు కల్పిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ బాబు పేర్కొన్నారు.బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల భోజన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యావిధానంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుధాకర్ నాయక్, నాయకులు ఆకులేటి వీరనారప్ప, ఆకులేటి భాస్కర్,కావేటి మల్లికార్జున, డి.చెర్లోపల్లి నారాయణస్వామి పాల్గొన్నారు.

మహిళపై దాడి ... బంగారు ఆభరణాల అపహరణ

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఓ ఇంటిలోకి ఆగంతకుడు చొరబడి ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి 12 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలు తెలిపిన వివరాలు... బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి తలుపులు తట్టి తలుపులు తెరవగానే ఆ మహిళపై సుత్తితో తలపై బాది లోనికి ప్రవేశించిన దుండగులు స్పృహ తప్పి పడిపోయిన మహిళ మెడలోని 4 తులాల బంగారు గొలుసు, చేతులకు ఉన్న 8 తులాల బంగారు గాజులను అపహరించుకుని వెళ్లారు. మెళకువ వచ్చిన మహిళ సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. గాయపడ్డ మహిళను పోలీసులు, ఆమె బంధువుల సహాయంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి రైల్వే పట్టాలపై రైలు కింద పడి ధర్మవరం పట్టణానికి గిర్రాజు కాలనీ కు చెందిన ఎనుముల అశోక్ (32) మృతి చెందాడు. అశోక్ ఈ నెల 18వ తేదీ 10 గంటలకు ధర్మవరం పట్టణం నుండి చెన్నె కొత్తపల్లి లోని వారి బంధువులు ఇంటికి వెళ్లి, అక్కడి నుంచి ద్విచక్రవాహనంలో వచ్చి ప్యాదిండి సమీపన గల రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం జిఆర్పి రైల్వే పోలీసులు శ్రీనివాసులు, నాగరాజు తెలిపారు. అశోక్ ధర్మవరంలోని ఓ బ్యాంకులో ఎనిమిది లక్షల రూపాయలకు అప్పు తెచ్చి, తనకున్న దూర అలవాట్లతో సర్వం కోల్పోయాడన్నారు. , ఇంటిని కుదువ పెట్టి ఎనిమిది లక్షలు అప్పు తెచ్చుకున్నాడని,అప్పు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు.

ఎండు గడ్డికి నిప్పు... రూ.5 లక్షలు నష్టం

ప్రజాశక్తి - బత్తలపల్లి

బీడు పొలాల్లో ఎండిపోయిన గ్రాసానికి ఆకతాయిలు నిప్పు పెట్టడంతో బోరు బావులు కింద సాగు చేసిన పంటలు అగ్నిప్రమాదంలో దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో రూ.ఐదు లక్షల వరకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. బత్తలపల్లికి చెందిన రైతులు గడుపూటి శేషయ్య, గడుపూటి రామానాయుడు, గడిపూటి రమేష్ బాబు, గడపూటి గోపీనాథ్ ముష్టూరు రెవిన్యూ పొలంలో సుమారు 10 ఎకరాల పొలంలో దానిమ్మ పంట సాగు చేస్తున్నారు. 3250 దానిమ్మ చెట్లను గత ఏడు సంవత్సరాలుగా సూక్ష్మ సేద్య పరికరాలతో సంరక్షించుకుంటున్నారు. బుధవారం బీడు పొలాలలో ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో దానిమ్మ చెట్లల్లోని దాదాపు 50 డ్రిప్పు పైపులు, మూడు స్టార్టర్లు, విద్యుత్ సర్వీస్ వైర్లు మొత్తం కాలి బూడిదయ్యాయి. సమీప పొలాల్లోని రైతుల సమాచారంతో పొలం వద్దకు బాధిత రైతులు వెళ్లి చూడగా అప్పటికే స్టార్టర్లు విద్యుత్ వైర్లు కాలిపోవడంతో సుమారుగా 5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. ఆకతాయిలు ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో తమ పొలాలకు మంటలు వ్యాపించి తీవ్ర నష్టం చేకూరిందన్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి సూక్ష్మ సేద్య పరికరాలు అందించి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

గోరంట్ల : మండలంలోని రామన్నపల్లిలో రైతు నారాయణకు చెందిన ఉలవకట్టి వామికి గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం మధ్యాహ్నం నిప్పు పెట్టడంతో నిలువ ఉంచిన ఉలవకట్టి గడ్డివామి కాలిపోయింది. దీంతో తనకు రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిలినట్లు బాధితుడు నారాయణప్ప తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ద్విచక్రవాహనం చోరీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని జెకె మెడికల్ స్టోర్ వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం చోరీకి గురైంది. దీంతో బాధితుడు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ మక్బూల్‌బాషా తెలిపారు.

మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఏపీ సీడాప్ ఆధ్వర్యంలో మైనార్టీ యువతీ యువకులకు పారిశ్రామిక రంగంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహణ అధికారి డి. సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారం తో పాటు విద్యార్హతలు ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ అందజేయాలన్నారు. దరఖాస్తులు కార్యనిర్వహణ అధికారి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కలెక్టరేట్ కాంపౌండ్ అనంతపురానికి పంపాలన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9849901138 కి ఫోన్ చేసి సంప్రదించవచ్చునని చెప్పారు.

అమరాపురం జెడ్పీటీసీ టిడిపిలో చేరిక

మడకశిర : నియోజకవర్గంలోని అమరాపురం మండల జెడ్పీటీసీ స్వారక్క నరసింహమూర్తి వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంత భవనంలో ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో జెడ్పీటీసీతోపాటు 30 కుటుంబాల సభ్యులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగప్ప, డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. దశల వారి ఉద్యమంలో భాగంగా బుధవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి ముందు ఆందోళన చేసి, బాలయ్య పిఎ శ్రీనివాస్ రావుకు వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. బాబు, ఇస్మాయిల్, అఖిల్, రాజు, రంజాని, నరేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

నిరుపేద కుటుంబం సొంతింటి కలను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నెరవేర్చారు. మండల పరిధిలోని ఆమిదాలగొంది పంచాయతీ హెచ్ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన నరసింహమూర్తి కుటుంబానికి ఏడు సంవత్సరాల నుంచి ఇల్లు లేక బాత్రూంలో నివసిస్తుండేవారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఇల్లును నిర్మించారు. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, కుంచిటిగ వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం పాండురంగప్ప, కన్వీనర్ లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రెటరీ రంగే గౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు , కౌన్సిలర్ బలరాం, భాస్కర్ రెడ్డి, మంజునాథ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ ప్రథమ మహా సభను జయప్రదం చేయాలని ఉద్యోగుల సంఘం పెనుకొండ తాలూకా అధ్యక్షుడు ఎస్. అబ్దుల్ ఖాదర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్ చేతులు మీదుగా మహా సభ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి ఎం.బషీర్, ఉపాధ్యక్షులు కె. చంద్రశేఖర్, బిఎం.సాదిక్, బిఎస్. జగన్నాథ్, కోశాధికారి వి. రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలో కొట్నూరు లో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. తెల్లవారుజాము నుండి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప తదితర టిడిపి నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్, తదితరులను ఘనంగా సన్మానించారు.